జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం..

- రూ. 2 కోట్లతో అంతర్గత రోడ్ల పనుల ప్రారంభం
- అక్రమ లేఅవుట్లు, ఫాంహౌస్‌లను క్రమబద్ధీకరిస్తాం..
- 'ఆంధ్రజ్యోతి'తో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు శాత వాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) కృషి చేస్తుంది. స్మార్ట్ సిటీ నిధులతో జిల్లా కేంద్రం నడిబొడ్డు నుంచి ప్రధాన రహదారులు, కొన్ని ప్రాంతాలు మాత్రమే అభివృద్ధి సాధించాయి. నగరంలోని మిగతా ప్రాం తాలను, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను, గ్రామీణ ప్రాంతాలను సైతం అభివృద్ధికి ఆనవాళ్లుగా మార్చు తాం.. జిల్లావ్యాప్తంగా అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లను, ఫాం హౌస్‌లను, వ్యాపార వాణిజ్య సముదా యాలు, గోడౌన్‌లు, ఫంక్షన్‌హాళ్లను క్రమబద్ధీకరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటాం.. సుడా స్వయం పోషకంగా మారడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమా లను విస్తృతం చేస్తుంది.. టిప్సన్ కన్సల్టెన్సీ ద్వారా 500 కోట్ల రుణాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నాం' సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అని అన్నారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

అంగారికా టౌన్‌షిప్ అభివృద్ధికి రూ. 50 కోట్లతో అంచనాలు

రామకృష్ణకాలనీలో 80 ఎకరాల్లో 800 ప్లాట్లను ఏర్పాటు చేసి గత ప్రభుత్వం అంగారిక టౌన్‌షిప్ పేరిట వేలం వేసి 147 కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. అక్కడ కనీస సౌకర్యాలు కల్పించని కారణంగా ప్లాట్ల యజమానులు పనులు చేపట్టలేకపోయారు. ఈ టౌన్‌షిప్‌లో కనీస వసతుల కల్పనకు 50 కోట్లతో అంచనా తయారు చేయించాం. అంతర్గత రోడ్లకు 2 కోట్లు మంజూరు చేసి టెండర్లు ఖరారు చేశాం. కాంట్రాక్టర్ ఇప్పటికే పనులు ప్రారంభిం చారు. 20 కోట్ల రూపాయలను విడుదల చేయాలని రాజీవ్ స్వగృహ సంస్థకు కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి సాను కూల స్పందన వచ్చింది. అవిరాగానే మిగతా పనులు చేపడతాం.

మౌలిక వసతుల కల్పన

హైదరాబాద్, వరంగల్ నగరాల తర్వాత కరీంనగర్ అభివృద్ధి చెందుతున్న నగరంగా ఉన్నది. జిల్లా కేంద్రం గ్రామీణ ప్రాంతాల ప్రజల వలసలతో విస్తరిస్తున్నది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి సుడా పరిధిని జిల్లా మొత్తానికి విస్తరించింది. స్మార్ట్ సిటీ నిధులతో కరీంనగర్ నగరం నడిబొడ్డు నుంచి కొంత విస్తీర్ణం మేరకు అభివృద్ధి జరిగింది. 60 ఫీట్లు, 40 ఫీట్ల రోడ్ల వరకు విస్తరణ జరిగింది. అంతర్గత రోడ్లు, చిన్న చిన్న వీధులు అభివృద్ధి చెందాల్సి ఉన్నది. మండల కేంద్రాల్లో కూడా రోడ్లు, డ్రైనేజీలు, కనీస వసతుల కల్పన చేపట్టాల్సి ఉన్నది. 12 లక్షల పైచిలుకు జనాభాతో 2,687 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సుడా పరిధిని సమగ్రంగా అభివృద్ధిపర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

రూ. ఆరు కోట్లతో అభివృద్ధి పనులు

స్మార్ట్ సిటీ పరిధిలో అభివృద్ధి కాని వీధులు, కరీంనగర్ రూరల్, చొప్పదండి, మానకొండూర్ నియో జకవర్గాల పరిధిలో ఆరు కోట్ల రూపాయల నిధులతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలకు టెండర్లు పిలవబో తున్నాం. చొప్పదండి నియోజక వర్గంలో కొక్కెరకుంట నుంచి కోనేరుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 1.2 కోట్లు కేటాయిం చాం. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని చింతకుంట, ఆరెపల్లి, మల్కాపూర్, కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కోటి రూపాయల అంచనా వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు, హైమాస్ లైట్ల ఏర్పాటు కోసం టెండర్లు పిలిచాం.

రూ. 500 కోట్ల రుణం కోసం ప్రయత్నాలు..

టిప్సన్ అనే కన్సల్టెన్సీ సుడాను, వరంగల్ కుడాను సంప్రదించింది. రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారి టీలకు బ్యాంకుల నుంచి వెయ్యికోట్ల మేరకు రుణం ఇప్పించేందుకు ఆ సంస్థ కన్సల్టెన్సీగా వ్యవహరించ డానికి ముందుకు వచ్చింది. రుణం కోసం ప్రయత్నాలు ప్రారంభించాం. ఈ నిధులు వస్తే జిల్లాలోని చొప్పదండి, కొత్తపల్లి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలు, అన్ని మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం కలుగు తుంది. ప్రభుత్వం 2017లో సుడాను ఏర్పాటు చేసిన సమ యంలో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు కొత్తపల్లి మున్సి పాలిటీ, 71 గ్రామాలను దీని పరిధిలో చేర్చింది. 2018లో ఎనిమిది గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో విలీనం చేసింది. ఆనాటి సుడా పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమయింది. ఇటీవలే 208 గ్రామాలు, కరీంనగర్ కార్పొరేషన్, కొత్తపల్లి, చొప్పదండి, జమ్మి కుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలతో సుడా పరిధిని 2,687 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించింది. దీని మాస్టర్ ప్లాన్ ఇంకా తయారు కావాల్సి ఉంది. ఆలోగా పాత సుడా పరిధిని అభివృద్ధిపరిచేందుకు నిధులు వెచ్చిస్తున్నాం.

సమగ్ర మాస్టర్ ప్లాన్

కరీంనగర్ జిల్లా కేంద్రంలో 1997 తర్వాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయలేదు. ప్రస్తుతం సుడా సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. అమృత్ పథకం కింద 1.75 కోట్ల కేంద్రం నిధులతో కరీంనగర్, రామగుండం, ఆదిలాబాద్ మాస్టర్ ప్లాన్లు సిద్ధం

మిగతా 8వ పేజీలో...

కేంద్ర నిధులను దారి మళ్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

భగత్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ సహా వివిధ కార్యక్రమాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్స్‌ను విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 ఏళ్ల కాంట్రాక్ట్ పద్ధతిన సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామి ఇచ్చి అమలుచేయడం లేదన్నారు. వివిధ వర్గాలకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. సంక్రాంతి తర్వాత ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.

మహాశక్తి ఆలయంలో పడిపూజ

- పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ఆదివారం రాత్రి కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు, హిందూ బంధవులు, భక్తులతో కలసి పూజలు నిర్వహించారు.



స్వామియే శరణం అయ్యప్పా

- కఠిన నియమాల దీక్ష
- ఆధ్యాత్మికత, క్రమశిక్షణాయుత జీవితానికి దోహదం

-కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

7

జమ్మికుంట టు తమిళనాడు

- పత్తి బేళ్ల తరలింపు
- రెండు దశాబ్దాలుగా వ్యాపారం

-జమ్మికుంట రూరల్, ఆంధ్రజ్యోతి



రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



వెదిరలో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని వెదిరలో రైతు సేవా కేంద్రం, గోడౌన్‌లను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర రావు, కొక్కెరకుంట చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పల అంజని ప్రసాద్ పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రానికి వస్తున్న అభ్యర్థి



ఉమెన్స్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో గ్రూప్-2 అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఆలస్యంగా వచ్చి అధికారులతో మాట్లాడుతున్న అభ్యర్థి



పరీక్షా కేంద్రంలోకి పరుగు పెడుతున్న అభ్యర్థి

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

కరీంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 26,978 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 56 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నిర్వహించిన జనరల్ స్టడీస్ పరీక్షకు 13,273 మంది అభ్యర్థులు హాజరుకాగా 13,705 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 13,135 మంది హాజరు కాగా 13,843 మంది గైర్హాజరయ్యారు. 48.69శాతం హాజరుశాతం నమోదైనట్లుజిల్లా అధికారులు ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన విధంగా పరీక్ష సమయానికి గంట ముందు నుంచి అభ్యర్థులను కేంద్రాలోకి అనుమతించారు. అరగంట ముందు పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారాలను మూసివేసి ఆ తర్వాత వచ్చిన వారిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. దీనితో కొంత మంది ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసేందుకు అనుమతించాలని ప్రాధేయపడినప్పటికీ అధికారులు అనుమతించక పోవడంతో నిరాశతో వెనుదిరిగారు. కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. డిగ్రీ కళాశాలలో అంధ అభ్యర్థి సహాయకురాలి సహాయంతో పరీక్ష రాస్తుండగా నిశితంగా పరిశీలించారు. పరీక్ష ముగిసిన తర్వాత ఓఎంఆర్ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. జిల్లాలో మొదటిరోజు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు జరిగాయని, అభ్యర్థులు సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠబందోబస్తు ఏర్పాటు చేసి హాల్ టికెట్లను చూసి అభ్యర్థులను అనుమతించారు.



చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రంలోకి వస్తున్న అభ్యర్థులు

- తిమ్మాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనిమిది గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆలస్యంగా వచ్చిన 14 మంది అభ్యర్థులను అధికారులు లోపలికి అనుమతించ లేదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 అమలు చేశారు. పరీక్ష ముగిసిన అనంతరం ఒక్కసారిగా అభ్యర్థులు కేంద్రాల నుంచి బయటకు రావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

- హాజరుకానున్న 16 మండలాల జట్లు
- ప్రారంభించనున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు సోమవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 16 మండలాల నుంచి మహిళలు, పురుషులు, క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. దాదాపు 2 వేల మంది క్రీడాకారులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా అధికారులు ఈ క్రీడా పోటీలను స్టేడియంలో ప్రారంభించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికి జిల్లా అధికార యంత్రాంగం క్రీడాశాఖలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేశారు.

21 వరకు పోటీలు

సోమవారం ప్రారంభమయ్యే ఈ క్రీడా పోటీలు ఈ నెల 21 వరకు వివిధ క్రీడాంశాల్లో జరగను న్నాయి. సోమవారం మొదటి రోజు మహి ళలు, పురుషుల విభాగాల్లో ఖో-ఖో, ఆర్చరీ, కబడ్డీ, వాలీబాల్, బేస్‌బల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అంబేద్కర్ స్టేడియంతో పాటు ప్రాంతీయ క్రీడా పాఠశాలలో క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులను, క్రీడామైదానాలను ఏర్పాటు చేశారు. వివిధ మండ లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులు సకాలంలో వచ్చి క్రీడల్లో పాల్గొని క్రీడలను విజయవంతం చేయాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకా రులను ఈ నెల 27వ తేదీ నుంచి జవనరి 2వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు ఎంపిక చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు..

అంబేద్కర్ స్టేడియంలో పోటీలను నిర్వహించేందుకు మూడు ఖో-ఖో కోర్టులను, రెండు వాలీబాల్ కోర్టులను, మూడు కబడ్డీ కోర్టులను, అథ్లెటిక్స్ ట్రాక్‌ను ఏర్పా టు చేశారు. ఏర్పాట్లను డీవైఎస్‌వో శ్రీని వాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. అనంతరం ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడా జట్లకు డ్రా తీశారు.



ఖో-ఖో క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా సంఘాల ప్రతినిధులు



వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా చెట్లు

'నాలుగేళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా పనులు ప్రారంభించారు.. ఐదున్నర కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామంటే ఎంతో సంతోషపడ్డా... అప్పుడో...ఇప్పుడో వచ్చే పిల్లలు, యువకులతో కాలక్షేపం చేస్తున్న నాకు మంచిరోజులు రాబోతున్నాయని.. ఎంతో మందికి ఆహ్లాదం, ఉల్లాసం, ఉత్సాహం అందించవచ్చని ఆరాటపడ్డా... రోజురోజుకు జరుగుతున్న పనులను చూసి మురిసిపోయా.. చూడముచ్చట గొలిపే పచ్చికబయళ్లు.. మొక్కలు.. మరోవైపు పిల్లల కోసం ఆధునిక క్రీడాపరికరాలు, రంగురంగులతో మిరిమిట్లు గొలిపే మ్యూజికల్ వాటర్ పౌంటేన్లు ఏర్పాటు చేస్తే సంతోషపడ్డా.. పనులు తుది దశకు చేరినా నన్నెందుకు ప్రారంభించడం లేదు.. నాలుగేళ్ల నా నిరీక్షణకు ఎప్పుడు తెరదించుతారు'..

- కరీంనగర్ మల్టీపర్పస్ పార్క్ ఆత్మఘోష

ప్రారంభమెప్పుడు?

- పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని మల్టీపర్పస్ పార్క్
- కోట్లు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..

కరీంనగర్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నడిబొడ్డున ఉన్న మల్టీపర్పస్ మైదానంలో చక్కటి పార్కును ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ పాలకవర్గం నాలుగేళ్ల క్రితం నిర్ణయించింది. 2020 సంవత్సరంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 11 కోట్ల నిధులతో ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలు, మ్యూజికల్ ఫౌంటేన్, హెర్బల్ ప్లాంటేషన్, ఆకర్షణీయమైన పూలు, షో మొక్కలతో పార్కు అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి పనులు ప్రారం భించారు. దాదాపు 11 కోట్ల రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో పార్కు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ఓల్డ్ హైస్కూల్ భవనాన్ని ఆధునీకరించి కలరింగ్, లైటింగ్ సిస్టమ్‌తో చారిత్రక చిహ్నంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పార్కుకు వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక ఫుడ్ స్టాల్స్, వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

పలుమార్లు వాయిదాలు

ప్రారంభమైన కొద్దిరోజుల వరకు రేయింబవళ్లు పనులు జరుగడంతో అందరూ నిర్ణీత గడువులో పూర్తిచేసి ప్రారంభిస్తారని భావించారు. కాంట్రాక్టరు వివిధ కారణాలను చూపుతూ పనులు ఎక్కడికక్కడే వదిలిపెట్టడంతో గడువు ముగిసి ఏడాది దాటినా ఇంకా పనులు పూర్తికాలేదు. పనులు చేయకుంటే బ్లాక్ లిస్టులో పెడతామంటూ హెచ్చరికలు చేయడం, ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు చేసి చెప్పడం, కాంట్రాక్టర్ ఆలోగా చేసామని హామీ ఇవ్వడం ఇలా జరుగడం తంతుగా మారు తోంది. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు పలుమార్లు ఈ పార్కు పనులను సందర్శించి వేగంగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలంటూ పలుమార్లు కటాఫ్ తేదీలను ప్రకటించారు. పలు వాయిదాల తర్వాత 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను నవంబరు లోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని గత అక్టోబర్ 29న మేయర్ యాదగిరి సునీల్‌రావు పార్కులోని మ్యూజికల్ పౌంటేన్‌ను ట్రయల్ రన్ నిర్వహించి ప్రకటించారు. నవంబర్ పోయి డిసెంబరు రెండో వారానికి చేరుకున్నా ఇంకా ప్రారంభోత్సవ తేదీలు ఖరారు చేయలేదు.. ఇప్పటికైనా కోట్ల రూపాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నగరవాసులు కోరుతున్నారు.



మల్టీపర్పస్ పార్కు ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన టైల్స్



చిన్నారుల ఆట వస్తువులు

పరిగెడితే పతకమే



నాసిక్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకంతో రామానుజమ్మ

- ఏడు పదుల వయస్సులో అథ్లెట్‌గా రాణింపు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు
- సత్తాచాటుతున్న మాస్టర్ అథ్లెట్ తమటం రామానుజమ్మ

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయస్సులో ఆమె అలుపెరగని పరుగు తీస్తోంది. మాస్టర్ అథ్లెట్‌గా సత్తా చాటుతూ నంబరువన్‌గా నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన తమటం రామానుజమ్మ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 70 సంవత్సరాల వయస్సు పైబడిన విభాగాల్లో పరుగు పందెంలో తనకు ఎవరూ సాటి లేరని నిరూపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధిస్తూ యువతక ఆదర్శంగా నిలుస్తోంది. రామానుజమ్మకు చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి. పాఠశాల నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు దాదాపు వెయ్యి పతకాల వరకు సాధించింది. చిన్నతనంలో అమ్మనాన్న, వివాహ అనంతరం భర్త సహకారంతో అథ్లెటిక్స్‌లో విజయం సొంతం చేసుకుంది. మాస్టర్ అథ్లెటిక్స్ మహిళల 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజయాలను సాధించింది. 2023లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో, తమిళనాడు కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. 2018లో తెలంగాణ గచ్చిబౌలిలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, బొంబాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించింది. 2024 మహారాష్ట్ర నాసిక్‌లో, యూపీ అయోధ్యలో 800, 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించింది. 2023 సెప్టెంబరులో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో భారత్ నుంచి పాల్గొన్న తమటం రామానుజమ్మ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించి 70 సంవత్సరాల వయస్సులో దేశానికి వన్నె తెచ్చింది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకం సాధించిన రామానుజమ్మను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా దాతల సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. ప్రభుత్వం నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌కు కూడా సహకారం అందించాలని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం 71 సంవత్సరాల రామానుజమ్మ నిత్యం యోగా సాధన కూడా చేస్తోంది.



మలేషియాలో కాంస్య పతకం సాధించిన తరువాత జాతీయ జెండాతో రామానుజమ్మ

మనస్సు ఆనందంగా ఉంటే వయస్సు తగ్గుతుంది

- తమటం రామానుజమ్మ, మాస్టర్ అథ్లెట్, అంతర్జాతీయ క్రీడాకారిణి



మనస్సును ఆనందంగా ఉంచితే వయస్సు తగ్గుతుంది. ఇదే నా ఆరోగ్య రహస్యం. మాస్టర్ అథ్లెట్‌గా రాణించడానికి మనస్సును ఆనందంగా ఉంచడమే ప్రధాన కారణం. ప్రతీరోజు యోగా, వ్యాయామంతో ఫిట్నెస్ సాధిస్తున్నాను. అనారోగ్య(బీపీ, షుగర్) సమస్యలు లేకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నాను.

అథ్లెట్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలి

- గొట్టెముక్కల శేఖర్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది క్రీడాకారులు మరుగున పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించాలి. మాస్టర్ అథ్లెట్స్‌కు ప్రభుత్వం కొని నిధులను కేటాయించాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపికైన క్రీడాకారులు సొంత డబ్బులతో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేక పోతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

- సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ నిత్యం ప్రజల మధ్య ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సీపీఐ నాయ కులకు సూచించారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కమ్యూనిజాన్ని ఆదరిస్తున్నారని, అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే కారణమన్నారు. డిసెంబర్ 26 సీపీఐ వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతుందని, ఈ సందర్భంగా వాడవాడన, గ్రామ గ్రామాల వంద వసంతాల కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులకు సంబంధించిన అనేక హక్కులను సాధించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడవ సారి అధికా రంలోకి వచ్చిన తరువాత ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలకు తహతహలాడుతున్నారని, దేశంలో ప్రజలపై పన్ను భారా న్ని మోపుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా ఒక్కో వస్తువుపై ఒక్కో రకమైన పన్ను విధిస్తున్నారన్నారు. రాబోయే కాలం ఎన్నికల కాలమని, స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ, మండల ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గెలుపు కోసం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడ్డి ఎల్లయ్య, స్వామి, ఆరెల్లి పోషం, తాళ్లపల్లి మల్లయ్య, మార్కపురి సూర్య, ప్రీతం, ఓదమ్మ, కన్నం లక్ష్మీనారాయణ, రాజయ్య, లెనిన్, రమ, దప్పు రాజు, మొండి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు ద్విచక్రవాహనం మీద నుండి కింద పడి మృతి చెందాడు. వీణ వంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గురుకుంట్ల రాకేష్ (30) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనంపై అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికి అక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్లే రాకేష్ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రాకేష్‌కు నవంబరు 10న నిశ్చితార్థం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్‌లో ప్రైవేట్ స్కూల్ వ్యాన్ దగ్ధం

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరంగల్ రోడ్‌లో గల మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో పార్క్ చేసి ఉన్న స్కూల్ వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం పాఠశాల ఆవరణలో నాలుగు వ్యాన్లు పార్క్ చేసి ఉండగా, ఒక వ్యాన్‌లో నుంచి మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సెలవు దినం కావడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే నివేశన గృహాలు, సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం తాగి, అగ్గిపెట్టె, సిగరెట్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పాఠశాల యాజమాన్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దగ్ధమైనస్కూల్ వ్యాన్

విద్యార్థినికి వేధింపులు.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు ప్రాంతంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిని అదే కళాశాలకు చెందిన ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశాడని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. కొద్ది రోజులుగా విద్యార్థినిని వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. కాగా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు ఎస్ఐ సాంబమూర్తి నిరాకరించారు.

గంజాయి పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అశోక్‌నగర్ ప్రాంతంలో గంజాయిని పట్టుకుని నిందితుడిని అరెస్టు చేశామని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నీరజ్‌కుమార్(19)ను అశోక్‌నగర్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి కిలో 655 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. బీహార్ రాష్ట్రంలోని పర్బటిర్‌బల్ ప్రాంతానికి చెందిన నీరజ్‌కుమార్ 8 నెలల క్రితం కరీంనగర్‌కు వచ్చి కూలీగా పనిచేస్తుండేవాడు. ఐదు నెలల కిందట బీహార్‌కు వెళ్లిన నీరజ్‌కుమార్ అక్కడ గంజాయికి అలవాటుపడ్డాడు. డబ్బులు లేకపోవడంతో కరీంనగర్‌లో గంజాయిని విక్రయించి సంపాదించాలని పథకం వేశాడు. బీహార్‌లో 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన నీరజ్‌కుమార్ 15 రోజుల కిందట కరీంనగర్‌కు చేరుకున్నాడు. కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ నిత్యం గంజాయి సేవించేవాడు. మిగతా గంజాయిని విక్రయించేందుకు శనివారం సాయంత్రం గౌరిశెట్టి కాంప్లెక్స్ వద్ద ఉండగా అప్పుడే అక్కడకు వచ్చిన పోలీసు వాహనాన్ని చూసి నీరజ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిం చాడు. వెంటనే పోలీసులు అతడిని తనిఖీ చేసి కిలో 655 గ్రాముల గంజాయి, ఒక మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నీరజ్‌కుమార్‌ను ఆదివారం కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ఆదివారం.. ఆధ్యాత్మికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మల్లన్న బోనాలు, అయ్యప్ప పడిపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. జగిత్యాల జిల్లాలోని మల్లన్నపేట మల్లికార్జున ఆలయంలో బోనాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. షష్టిమాసం సందర్భంగా ఆదివారం స్వామివారి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మల్లన్న పట్నాల నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు తెల్లవారు జాము నుంచే రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోడెమొక్కు క్యూలో రాజన్న దర్శనానికి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ఆలయాలను సందర్శించిన ప్రభుత్వ విప్

వేములవాడలోని పలు దేవాలయాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. పట్టణంలోని దత్తాత్రేయస్వామి, కేదారేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ


అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న అయ్యప్ప దీక్ష స్వాములు

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం అంగరంగ వైభంగా నిర్వహించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమం భక్తితో నిర్వహించారు. అనంతరం రత్నాకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, బందెల ఉదయ్, అయ్యప్ప దీక్షపరులు పెద్ది శ్రీనివాస్, గంట్యాల రాజేందర్, సంకోజు నరేష్, సిరంగి సంతోష్ కుమార్, బోడకుంటి రమేష్, మనీష్, రామస్వామి, పెద్దూరి భరత్ పాల్గొన్నారు.


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భక్తుల పెన్నిధి..మల్లన్న సన్నిధి...

- భారీగా తరలివచ్చి.. బోనాలు సమర్పించిన భక్తులు


గొల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అంతా కిటకిటలాడింది. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం, సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరసర ప్రదేశాలు ఎటూ చూసిన భక్తులతో పోటెత్తింది. ఆలయం నలువైపులా వాహనాలతో, భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 96,030 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండా ఎస్‌పీసీ విద్యార్థులు సేవలను అందించారు. జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ ఛైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- వృథా అవుతున్న నిధులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 15,(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో లక్షలు రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మొ క్కలతో పాటు ఇతర వసతులు వృథాగా మారాయి. గ్రామాల్లో ఆహ్లాదం కోసం పల్లె పార్కులుగా తీర్చి దిద్దాలనే ఆలోచనతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి వృథాగా మారాయి. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని 24గ్రామపంచాయతీలు ఉండగా మంగపేట మినహా మిగతా 23గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ భూములను గుర్తించి గత ఐదు సంవత్సరాల క్రితం లక్షలు ఖర్చుచేసి మొక్కలు నాటారు. వాటి నిర్వహణ కూడా ప్రభుత్వం డబ్బులు వెచ్చించింది. ఉపాధి హామీ పథకం గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసశారు. పిల్లలు, పెద్దలు సేదతీర్చుకు నేందుకు, వనాలలో వాకింగ్ ఇతర ఆరోగ్యకరమైన ఎక్సర్‌సైజ్ చేసుకునేందుకు వీటిని తీర్చి దిద్దారు. పల్లెప్రకృతి వనాలు పెట్టి సుమారు రెండు సంవత్సరాల వరకు ఉపాధిహామీ సిబ్బంది చూసుకునేది. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పల్లెప్రకృతి వనాలలో మొక్కలకు నీరు పోయించడంతో పాటు వనాలలో పెరిగిన గడ్డి కూడా ఈజీఎస్ కూలీలద్వారా తీయించారు. పల్లె ప్రకృతి వనానికి ఒక్కొక్క గ్రామానికి సుమారు లక్ష రూపాయల నుంచి 1.70.000 ఉపాధిహామీ ద్వారా ఖర్చు చేశారు. పల్లెప్రకృతి వనాలు కొన్ని గ్రామాలలో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు ఈజీఎస్ ద్వారా పల్లెప్రకృతి వనసంరక్షణ నిర్వహించి అనంతరం ఈజీఎస్ తప్పుకొని గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీకి అప్పగించడంతో ప్రకృతి వనం నిర్వహణపై పెద్దగా మొగ్గుచూపులేదు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు కూడా పల్లెప్రకృతి వనాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏపుగా పెరిగిన మొక్కల నిర్వహణలేక ఎండిపోతున్నారు. ప్రభుత్వం ప్రకృతి వనాలకు లక్షలు ఖర్చుచేసి మొక్కలను పెంచితే నిర్వహిణ లేక ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి వనాలను సంర క్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మీర్జంపేట పల్లె ప్రకృతివనం


మీర్జంపేటలోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన చెట్లు

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ


ధర్మపురి గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నదీ వరకు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగనీయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వైభవంగా దత్తాత్రేయుడి జయంత్యుత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ నుంచి గుట్ట పైకి వంతెన త్వరితగతిన నిర్మించేలా చూస్తానన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకునేందుకు మంత్రి పొన్నం విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోటు ద్వారా గుట్టపైకి చేరుకున్నారు. దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు రవీందర్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు ఉప్పుల అంజన్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడగాని వెంకటేష్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ



లక్ష్మీనరసింహస్వామి శావతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కిషన్‌రావుపేట లోని శ్రీ నాగపల్లి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు స్వామి వారి అర్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. నర్సింహస్వామి గోవిందా... గోవిందా అంటూ ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం చెక్కబండి దామోదర్‌రెడ్డి వనజారెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, గౌరవ అధ్యక్షులు పూదరి రమేష్, కుమ్మరి వెంకటేష్, తరాళ్ల శివకుమార్, పాదం వెంకటేష్, గౌరు తిరుపతి, పాదం సాయి, రాయమల్లు పాల్గొన్నారు.

భక్తులపై తేనెటీగల దాడి

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : చందుర్తి మండలం మర్రిగడ్డ మల్లికార్జున స్వామి ఆలయంలో మొ క్కులు చెల్లించేం దుకు వచ్చిన భక్తులపై ఆదివారం తేనెటీగల దాడి చేయడంతో పదిమందికి పైగా గాయపడ్డారు. మండలంలోని మర్రిగడ్డ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయంలో బోనం మొక్కు చెల్లించేందుకు భక్తులు వచ్చారు. ఆలయ పరిసరాల్లోని గిరక తాటి చెట్ల వద్ద బోనం వండేందుకు పొయ్యి ఏర్పాటు చేసుకొని మంట పెట్టారు. పొగ రావడంతో గిరక తాటి చెట్లపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడ ఉన్న భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో మరి గడ్డకు చెందిన మల్యాల అంజయ్య, భైరగోని ఎల్లయ్య, మల్యాల రాజవ్వ, కత్తి లస్మవ్వ, మల్యాల లక్ష్మి. స్రవంతితోపాటు వట్టెంల గ్రామానికి చెందిన పచ్చిమట్ల మల్లవ్వ అనే వృద్ధురాలు, ఐదేళ్ల గగన అనే బాలిక మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను చికిత్స నిమిత్తం వేముల వాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఆకుల కొమురయ్య గౌడ్ ఆదివారం ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కొమురయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృత్తిపై ఆధారపడ్డ గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని , కొమురయ్యకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని గౌడ కులస్థులు కోరారు.

అదుపు తప్పి లారీ బోల్తా

మల్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజీ సమీపంలో శనివారం అర్ధరాత్రి జగిత్యాల వైపు వెలుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. రాత్రి సమయం కావడంతో ఇతర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. లారీ వివరాలు తెలియక పోగా ఎలాంటి నష్టం జరుగలేదని స్థానికులు తెలిపారు. లారీ త్వరగా తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆలస్యం అయింది.

స్వామియే.. శరణం అయ్యప్ప

- కఠిన నియమాల దీక్ష
- ఆధ్యాత్మికత, క్రమశిక్షణాయుత జీవితానికి దోహదం



కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్ష కఠిన మైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్ష తీసుకున్న వ్యక్తి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దే వాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం , ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు ఓ అయ్యప్ప ప్రతిరూ పంగా భావిస్తుంటారు. వ్యక్తిలో పరమాత్మను దర్శించాలన్నదే దీని పరమార్థం. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు.

దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి...

- శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ ని బంధనలు పాటిస్తూ దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశు భ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరుల పట్ల ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభి మానాలతో మెలగాలి. మనసారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

దీక్షా కాలంలో నియమ నిబంధనలు



- దీక్ష తీసుకున్న వ్యక్తి పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతినిత్యం రెండు పూటలా తలస్నానం ఆచరించాలి. లఘు శంకకు వెళితే పాద ప్రక్షాలన, దీర్ఘ శంకకు వెళితే కంఠ స్నానం చేయాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. మత సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలా పూజలు, నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీ సుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతిసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండవ పూట సాయంత్రం అల్పాహారం స్వీకరించాలి.
- భూశయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- ఇంద్రియ నిగ్రహం పాటిస్తూ సాత్వికాహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలను వృథా చేయకూడదు.
- మిత, మృదు భాషణ చేయాలి. పరుష వాక్కులు కూడదు.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్ళు మరణిస్తే మాల విసర్జన చేయాలి. సంవ త్సర సూతకులకు ఆ యేడు దీక్ష కూడదు.
- పడి పూజలు, భజనల్లో పాల్గొనాలి. ఒక్క మారైనా అన్నదానం చేయాలి.

శబరిమల యాత్రలో జాగ్రత్తలు

దీక్షాకాలంలో కఠిన నియమాలు పాటిస్తూ గడపడం ఎంత ముఖ్యమో శబరిమలయాత్ర చేయడం అంతే ముఖ్యం. యాత్రలో కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. అవగాహనా లోపంతో అష్ట కష్టాలు పడటం కంటే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే యాత్ర సఫలమవుతుంది. ఏ స్థాయి దీక్షాపరులైనా ఈ నియమాలు గుర్తుంచుకొని యాత్ర సాగిస్తే అయ్యప్ప కరుణాకటాక్ష వీక్షణాలు ఎల్లపుడూ ఉంటాయి. ఆ నియమాలు మీకోసం...



- గురుస్వామితో ఇరుముడి ధరించే ముందు రోజే ఇరుముడి సామగ్రితోపాటు మార్గమధ్యలో తినడానికి అల్పాహారం సిద్ధం చేసుకోవాలి.
- కప్పుకునేందుకు, పరచుకునేందుకు రెండు చద్దర్లు, దిండు, దీక్షా వస్త్రాలు, టవల్స్ వంటివి సిద్ధం చేసుకోవాలి.
- ఒక టార్చ్ లైట్, ఒక వాటర్ బాటిల్, ఒక పొడుగాటి కర్ర (అక్కడిదైనా పరవాలేదు), బిస్కట్లు, గ్లూకోజ్ లేదా పండ్ల రసాల బాటిల్ ఉంచుకోవాలి.
- దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అవసరమయ్యే మందులు, మామూలువారు జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, తదితర రుగ్మతలకు సంబంధించిన మందులు ఉంచుకోవాలి.
- సామాను ఎక్కువగా కాకుండా అన్నీ ఒకే బ్యాగులో పట్టేలా సర్దుకోవాలి.
- వాహనాల్లో, సర్వీసుల్లో వెళ్లేవారు మొదలే రూట్‌పై అవగాహన కలిగియుండాలి. ఇతర యాత్రలను వెళ్లేప్పుడుకానీ వచ్చేప్పుడుకానీ చేయవచ్చు.
- యాత్రలో మధ్యమధ్యలో ఆగడానికి సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి. పాదయాత్రలో గురుస్వామితో కలిసి గుంపులు గుంపులుగా వెళ్లాలి. అడవి ప్రాంతం కావడంతో అనుక్షణం జాగ్రత్తగా ఉండాలి.
- సన్నిదానంలో మొక్కుల అనంతరం పదునెట్టాంబడి ఎక్కేముందు అతి జాగ్రత్త అవసరం. నెట్టుకోకుండా నెమ్మదిగా వెళితే దెబ్బలు తగలకుండా ఉంటుంది.
- స్వామి, మకరజ్యోతి దర్శనం తర్వాత ఉరుకులు, పరుగులు కూడదు. తొక్కిసలాట జరిగే అవకాశం ఉంటుంది.

మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మే డిపల్లి సత్యం అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో మహిళా విశ్వ విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించిం దన్నారు. అంతకుముందు మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించే పల్లె దవాఖాన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండలంలోని రజకసంఘం నాయకులు శంకర్, లక్ష్మన్, రాజు, గంగాధర్, రాజయ్య, జిల్లా వైద్య ఆ రోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, చొప్ప దండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాప్‌లో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ముకరంపురలోని ఒక మొబైల్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. షాప్ యజమాని సాయిరాం శనివారం రాత్రి 10 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు మొబైల్ షాప్ సగం వరకు తెరిచి ఉన్నట్లు గమనించి స్థానికులు సాయిరాంకు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు క్యాష్ కౌంటర్ తెరచి చూశారని, షాపులో ఎలాంటి వస్తువులు, డబ్బులు పోలేదని సాయిరాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కోర్టు ఉద్యోగి

కొడిమ్యాల, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టులో ఉద్యోగం చేస్తున్న మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన ముదాం శంకర్ నిజాయితీ చాటుకు న్నాడు. శంకర్ శనివారం కరీంనగర్‌కు వెళ్తుండగా పర్సు దొరికింది. గ్రామస్థులకు పర్సు దొరికిన విషయం తెలిపాడు. పర్సులో ఉన్న ఆధార్‌కార్డుతో గంగాధర మండలం ఇస్లాంపురం గ్రామానికి చెందిన దయ్యాల కొమురయ్యదిగా గ్రామస్థులు గుర్తించారు. పర్సులో ఉన్న 15 వేల నగదును కోర్టు ఉద్యోగి బాధితుడికి అందజేశాడు.

పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు



చందుర్తి మండలంలో అడవి పందులు ధ్వంసం చేసిన వరినారు

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్, మల్యాల, లింగంపేట పలు గ్రామాల్లో అడవి పందులు వరినారుతో పాటు చేతికందిన పత్తి, కంది పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవి పందుల బెడద నుంచి తమ పంటలను కాపాడు కోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినప్పటికీ అడవి పందులు అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి. మండలంలోని పలు గ్రామాలు గుట్ట, అడవి ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. అర్ధరాత్రి వేళ గుంపులు, గుంపులుగా పందులు పంటలపై దాడికి పాల్పడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

పంటలు చేతికి వచ్చే సమయంలో అడవి పందులు గుంపులుగా దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల గ్రామానికి చెందిన దమ్మ రవి అనే రైతుకు చెందిన పొలంలోని వరి నారును ధ్వంసం చేశాయి. అడవి పందుల బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

సింగారంలో వ్యవసాయ కూలీ బలవన్మరణం

ఎలారెడ్డిపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని వ్యవసాయ కూలీ వాసరి పెద్ద బాలయ్య(57) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలి పారు. ఆయన కథనం మేరకు పెద్ద బాలయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని జీవిస్తుండేవాడు. పదేళ్ల కిందట అతని భార్య పద్మ అనారో గ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురైన పెద్ద బాలయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న రాత్రి అతని తల్లి లక్ష్మి ఇంటిలో భోజనం చేసిన పెద్దబాలయ్య తన ఇంటికి వెళ్లి నిద్రించాడు. ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఆయన కొడుకు రాజు తలుపులను తట్టాడు. భవన స్లాబ్‌కు పెద్దబాలయ్య ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టు పక్కల వారి సహాయంతో సిరిసిల్ల ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన వ్యక్తి

గన్నేరువరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ గాయపడిన బాధితుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మృతుడి పేరు, ఊరు తెలియదని, అతడు సుమారు 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఫొటోఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మృతిడి తరపున ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పొలంలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం.. ఒకరి మృతి

కోనరావుపేట డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన బెజిగం అనిల్ (37) అనే యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శివంగాలపల్లికి చెందిన అనిల్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. అత్తగారి గ్రామం కనగర్తికి వెళ్తుండగా నిజామాబాద్ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. గాయాలవడంతో పొలంలో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి

బీర్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో గాయాలపాలై చికిత్స పొందుతూ బత్తిని పుష్ప(40) మృతి చెందినట్లు ఎస్సై కుమార స్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ భూమక్క లింగన్నల కుమార్తె పుష్పను సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్‌కు ఇచ్చి 20 ఏళ్ల క్రిం రెండో వివాహం చేశారు. దంపతులిద్దరూ తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 13న కూడా శ్రీనివాస్ పుష్పతో గొడవ కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పుష్ప తల్లి భూమక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీకి చెందిన నోముల వంశీకృష్ణ(25) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన వంశీకృష్ణ ఆరు నెలల నుంచి హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న కాలనీకి వచ్చిన వంశీకృష్ణ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంశీకృష్ణ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యవసాయ బావిలో శిశువు మృతదేహం

మేడిపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేడిపల్లి మండలంలోని కట్ల కుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం నవజాత శిశువు మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థుల ద్వారా సమాచారం తెలు సుకున్న పోలీసులు మగ శిశువు మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గడ్డం గంగారెడ్డికి చెందిన వ్యవసాయ బావి రోడ్డుకు పక్కన ఉండటంతో మృతి చెందిన శిశువును ఎవరైనా పడివేశారా లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

జమ్మికుంట To తమిళనాడు

- పత్తి బేళ్ల తరలింపు
- రెండు దశాబ్దాలుగా వ్యాపారం





మార్కెట్‌కు వచ్చిన ఐత్తులుదేరిన

జమ్మికుంట రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి వ్యాపార కేంద్రంగా జమ్మికుంట గుర్తింపు పొందింది. ఇక్కడ మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి బేళ్లుగా తయారు చేసి వస్త్ర పరి శ్రమలు ఎక్కువగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తారు. జమ్మికుంటలో రెండు దశాబ్దాలకు పైగా పత్తి వ్యాపారం సాగుతోంది. ఒకప్పుడు జమ్మికుంట మార్కెట్లో అపరాలు, వరి ధాన్యం కొనుగోళ్లు భారీగా జరిగేవి. ఈ ప్రాంత రైతులు పండించిన పంటలే కాకుండా చుట్టు పక్కల మండలాలు, జిల్లాల నుంచి కూడా రైతులు తాము పండించిన ధాన్యం, వేరుశనగ, పెసర్లు, మొక్కజొన్నలు, శనగలు జమ్మికుంట మార్కెట్‌కు తీసుకువచ్చేవారు. అందుకు తగ్గట్టుగానే పట్ట ణంలో రైస్ మిల్లు, నూనె మిల్లులు ఏర్పడ్డాయి. రెండున్నర దశాబ్దాల క్రితం నుంచి ఈ ప్రాంతంలో పత్తి పండించటం, ఆ పంటను స్థాని కంగా ఉన్న వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు కమీషన్‌పై తరలించేవారు. క్రమక్రమంగా స్థానికంగా జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేకంగా పత్తి కొను గోలు కోసం 2003లో కేశవపూర్ రోడ్డులోని నూతన వ్యవసాయ మార్కెట్‌ను అప్పటి మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి నిత్యం కోట్లాది రుపాయల పత్తి వ్యాపారం సాగుతోంది. ప్రతి రోజు 20వేల పత్తి బస్తాల పైచిలుకు రైతులు విక్రయానికి తీసుకువచ్చేవారు. దీంతో మార్కెట్ అంతా తెల్ల బంగారంతో నిండిపోయేది. పత్తి దిగుబడులు క్రమేపీ పెరుగడంతో జిన్నింగ్ మిల్లులు అదే తరహాలో పెరుగుతూ వచ్చాయి. మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి, వారి మిల్లుల్లో జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసి బేళ్లు తయారు చేస్తారు. వాటిని వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలైన తమిళనాడు రాష్ట్రం లోని కోయంబత్తూర్, మధురై, తిరుపూర్, తిర్నలవేలి, శీలం, రాజాపాలేం ప్రాంతాల్లో విక్రయిస్తారు. అక్కడ కోట్లలో పత్తి బేళ్ల విక్రయాలు జరుపుతున్నప్పటికీ నమ్మకంపై ఆధారంగానే విక్ర యాలు జరుపుతుంటారు. ఇక్కడి నుంచి పత్తి బేళ్లతో లుదేరిన లారీలు కానరాకుండాపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.

తగ్గిన జిన్నింగ్ మిల్లులు

రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంతరించుకున్న జమ్మికుంట పత్తి మార్కెట్ ప్రస్తుతం కొంత కళ తప్పిందని చెప్పవచ్చు. పట్టణంలో 18వరకు జిన్నింగ్ మిల్లులు ఉండేవి. సుమారు 30మంది పైచిలుకు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టేవారు. ప్రస్తుతం ఆరు మిల్లులు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడ లాభాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా కా ర్మికులు, కూలీలకు ఉపాధి తగ్గింది. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పూర్వవైభవం కోసం తగు రీతిలో చర్యలు చేపడితే వ్యాపారం కళకళలాడి ఉపాధి మార్గాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ఉచిత వైద్యశిబిరాలు

సుభాష్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అవగాహన లేక వ్యాధుల బారిన పడుతున్నారని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. నగరంలోని కిసాన్‌నగర్‌లో ఆదివారం ఒమెగాశుశృత క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, డాక్టర్ దీప్తి, అవినాష్, రాజేందర్, భవాని, శోభ పాల్గొన్నారు.

●స్థానిక పాతబజార్‌లో గల రిషి కాన్వెంట్ పాఠశాలలో రెనీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రిషి కాన్వెంట్ ఛైర్మన్ కామారపు చెన్నప్ప, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్‌రహ్మాన్, డాక్టర్ హీనాఫిర్దౌస్, డాక్టర్ విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

దత్త పౌర్ణమి ఉత్సవం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగంలోని పాతబజార్ గౌరీశంకరాలయంలో ఆదివారం పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో దత్త పౌర్ణమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దత్త సహిత శివ రుద్రాభిషేకం, మహాహారతి, దీపసేవ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఈఓ వెంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరి కాలని కోదండ రామాలయంలో సోమవారం నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కె.గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 11న కూడారై ఉత్సవం, 13న గోదారంగనాథస్వామి కల్యాణం జరుగనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ శుక్రవారం ఉదయం 11గంటలకు కుంకుమార్చన, సాయంత్రం పల్లకీసేవ జరుగుతుందని తెలిపారు.

'సాతులూరి' స్వామికి ఘన స్వాగతం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యజ్ఞవరాహక్షేత్రంలో సోమవారం నుంచి జరిగే ధనుర్మాస వ్రత మహోత్సవంలో ప్రవచనం చేసేందుకు ప్రముఖ ఉభయ వేదాంత పండితుడు సాతులూరి గోపాలకృష్ణమాచార్య స్వామి ఆదివారం క్షేత్రానికి రాగా ట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ నేతృత్వంలో సభ్యులు, భక్తులు ఆలయ ప్రత్యేక మర్యాదలతో స్వాగతం పలికారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, వారిని తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మాస్క్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, మంచి శిక్షణ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే భయం తొలిగి ప్రతిభ బయటకు వస్తుందని అన్నారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న శిక్షణకు విద్యా ర్థులు హాజరు కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, మాస్క్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ భూనాతచారి, శివరాంరెడ్డి, వంగళ శ్రీధర్ పాల్గొన్నారు.


విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

వాగ్దేవి వాసవీ క్లబ్‌కు అవార్డులు

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాగ్దేవి వాసవీ క్లబ్‌కు మూడు అవార్డులకు ఎంపికైంది. మదురైలో జరుగుతున్న వాసవీ క్లబ్‌లో బెస్ట్ ఇనవేటివ్ క్లబ్ అవార్డు, బెస్ట్ పాజిటివ్ ప్రెసిడెంట్, గుడ్ విల్ విజిట్ అవార్డు గెలుచుకుంది. అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి హెచ్‌ఎస్ నాగభూషణ చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి మూడు అవార్డులు అందుకున్నారు. క్లబ్ చేసిన అనేక కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఉమాదేవిని పలువురు అభినందించారు.


అవార్డు అందుకుంటున్న ఉమాదేవి

ఈనెల 27 నుంచి మాదిగ కళాబృందాల రథయాత్ర

సుభాష్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని లక్ష డప్పులు, వేయి గొంతులు అనే సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఈనెల 27 నుంచి మాదిగ కళాబృందాల రథయాత్ర నిర్వహించనున్నట్లు మాదిగ కళా మండలి ఉమ్మడి జిల్లా ఇంచార్జి రామంచ భరత్ తెలిపారు. ఆదివారం కళాకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయా లని జనవరి 25న వేయి గొంతులు-లక్ష డప్పులతో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఈలోగా వర్గీకరణ అమలు చేయకపోతే చావు డప్పు, వర్గీకరణ అమలు చేస్తే లగ్గం డప్పు కొడతామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు, రచయితలు, ఎంఆర్‌పీఎస్ అనుబంధ కులాలు, సామాజిక న్యాయం కోరుకునే అన్ని కులాల ప్రజాస్వామ్యవాదులు, అన్ని ప్రజాసంఘాలు, సాంస్కృతిక సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, బహుజన గర్జన ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గజ్జల అశోక్, పెద్దపల్లి జిల్లా డప్పు కళాకరుల అధ్యక్షుడు పులిపాక బానేష్, మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ నాయకుడు తాండ్ర నర్సయ్య, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం అంజయ్య పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, కె లక్ష్మణరావు, వెంకటస్వామి, తెలంగాణ బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాం రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్ర ఉద్యోగులు ఆదివారం మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌లను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్ల ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం అజిత, బి రమాదేవి పాల్గొన్నారు.

మాజీ ఎంపీ గొట్టె భూపతి కుటుంబానికి పరామర్శ

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా ఆదివారం మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కరీంనగర్‌లో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైశ్యసంఘాల ప్రతినిధులు, వైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతర కోసం 56 రోజుల ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి ప్రాణాలర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అనంతరం 300మందికి అల్పాహార వితరణ చేశారు. ఈకార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్‌కుమార్, మాజీ అధ్యక్షుడు ఏవి మల్లికార్జున్ పాల్గొన్నారు. వాసవి వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షురాలు కొల్లేటి విశాల అయ్యప్పదేవాలయంలో పులిహోర ప్రసాద వితరణ చేయగా క్లబ్ సభ్యురాలు శోభ తదితరులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంఘం కార్యాలయంలో మాజీ ఉపరాష్ట్రపతి సర్దార్ వల్లభాయ్‌పటేల్, పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలాడి రామారావు పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కవి నడిమెట్ల రామయ్య నివాసంలో ఆదివారం 140వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కవి విజయశ్రీ రచించిన మధుర పద కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు, కార్యక్రమంలో కవి అన్నవరం దేవేందర్, విలాసాగరం రవీందర్, తెరవే అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి, ఇటిక్యాల రాము, మెరుగు అంజయ్య, నసీరుద్దీన్, ఎండి ఖాలీద్, ఎస్ చైతన్య, మహేందర్, అరుణ్, వాసు, అఖిల్‌కుమార్, శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం..

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఈనెల31 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి మాస్టర్ ప్లాన్ అందజేస్తాం.

● అక్రమంగా లే అవుట్లు, ఫాంహౌజ్‌లు...

జిల్లా కేంద్రానికి 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో వ్యవసాయ భూముల్లో అక్రమ లే అవుట్లు, ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. గ్రామ పంచాయతీల నుంచి వ్యవసాయ భూముల్లో రెండు గదుల నిర్మాణం కోసం అనుమతులు పొంది 5 నుంచి 10 గుంటల స్థలంలో ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వాటిలోనే ఫంక్షన్లు, విందులు, వినోదాలు జరుపుతూ వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 30 ఫాంహౌస్‌లు, ఫంక్షన్‌హాళ్లు అక్రమంగా వెలిశాయి. ప్రస్తుతం సుడాకు సంవత్సరానికి 10 కోట్ల ఆదాయం ఉంది. వీటిని సరిచేస్తే కనీసం 30 కోట్ల మేరకు ఆదాయం పెరుగుతుంది. గ్రామీణ, మండల ప్రాంతాల్లో కూడా జీ+2 వరకే ఇల్లు నిర్మించుకోవడానికి పర్మిషన్లు ఇవ్వాలి. ఆపైన భవనాలు నిర్మిస్తే సుడా నుంచి పర్మిషన్ పొందాల్సి ఉంటుంది. పెద్దపెద్ద భవనాలు నిర్మించేవారు పర్మిషన్లు లేకుండా నిర్మించి సుడాకుపన్ను ఎగవేస్తున్నారు. వీరందరికి నోటీసులిచ్చి వాటిని క్రమబద్ధీకరిస్తాం. డీటీసీపీ లే అవుట్ లేకుండా ఎవరైనా ప్లాట్లు విక్రయిస్తే కొని నష్టపోవద్దు.

కేంద్ర మంత్రిని కలిసిన జర్నలిస్టు యూనియన్ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులను సన్మానించారు. విజయం సాధించిన కమిటీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

టీయూడబ్ల్యూజే కమిటీకి మంత్రి పొన్నం శుభాకాంక్షలు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(టీయూడబ్ల్యూజే) జిల్లా నూతన కమిటీ బాధ్యులకు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తుందని మంత్రి తెలిపారు.

రైతు సంఘానికి స్ప్రేయర్ అందజేత


రైతుసంఘానికి స్ప్రేయర్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ జైకిసాన్ రైతు సంఘానికి స్ప్రేయర్‌ను అందించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, సీనియర్ సభ్యులు రాళ్లబండి శంకర్, ప్రసాదరెడ్డి, కర్ర విద్యాసాగర్‌రెడ్డి, చాడ మల్లారెడ్డి, పిన్నింటి నారాయణరెడ్డి, జైకిసాన్ రైతు సంఘం అధ్యక్షుడు గుంటపల్లి రవీందర్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తయాస్వాడ శ్రీభక్తాంజనేయస్వామి, పోచమ్మ దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అధ్యక్షుడిగా ర్యాకం సుధాకర్‌పటేల్‌ను, ప్రధాన కార్యదర్శిగా న్యాలకొండ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొమ్మెన గిరిధర్ సతీష్, రేగుల సంజీవ్‌కుమార్, కట్ట నవీన్‌కుమార్‌ను, కోశాధికారిగా గుమ్మడి రాజయ్య ఎన్నుకున్నారు. ప్రచార కార్యదర్శిగా మునీందర్, చంద్రగిరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా తోట రాజు, తోట శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన టీజీవో కార్యవర్గం

సుభాష్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసింది. కేంద్ర మంత్రి వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు, ఆదాయ పరిమితిని రూ. 5లక్షల నుంచి రూ. 10లక్షల వరకు పెంచేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, సంగెం లక్ష్మణ్‌రావు, డాక్టర్ అరవింద్‌రెడ్డి, ట్రెజరీ డీడీ నాగరాజు, రామ్మోహన్, వెంకటేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, గడ్డం సుధాకర్, లక్ష్మినర్సింహరావు, రోహిత్, వీణ, మమత, అభినయ్‌రెడ్డి, రాజు, కొండల్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, చంద్రకళ, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, జోయల్ రాకేశ్, హమీద్‌షా, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు


లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు అందజేస్తున్న సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నెలల క్రితం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన ఫైళ్ల ప్రభుత్వానికి పంపించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు అందజేశామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆరోగ్యశ్రీ పరిధిని పది లక్షలకు పెంచిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, వాడి వెంకట్‌రెడ్డి, షబానా మహ్మద్, ఊరడి లత, మహాలక్ష్మి, అస్తపురం తిరుమల, షెహన్ష, మాసుంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి'

గంగాధర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం సీపీ అభిషేక్ మొహంతిని కోరారు. గంగాధర ప్రధాన రహదారిపై తరుచు ప్రమాదాలు జరుగుతున్నందున రక్షణ చర్యలపై పోలీసులు, ఆర్టీసీ అధికారులతో ఆదివారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీతో ప్రజల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రించేవారు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీకి వివరించారు. స్పందించిన సీపీ ట్రాఫిక్ నియంత్రణ కోసం చౌరస్తాలో పోలీస్ కానిస్టేబుల్‌ను ప్రతి రోజు డ్యూటీలో ఉంచుతామని తెలిపినట్లు ఎమ్మెల్యే వివరించారు. అనంతరం కరీంనగర్ ఆర్టీసీ డీఎంతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి బస్సులను రోడ్డుపై నిలుపకుండా బస్టాండ్‌కు వెళ్లేలా డ్రైవర్లకు సూచించాలన్నారు. ఆయన బస్సులను రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎమ్మెల్యే వివరించారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

శంకరపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడల్లో భాగంగా జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ హిసాముద్దీన్ టీషర్ట్స్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, గాజుల శ్రీనివాస్, గుర్రం శ్రీనివాస్, బండారి తిరుపతి సంపత్, సదానందం, రవి, చాంద్‌పాషా, షారుఖ్, వీరస్వామి పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

గంగాధర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను ఆదివారం నియమించారు. గట్టుభూత్కూర్‌లో గుండ సాయికుమార్, ముప్పిడినర్సయ్యపల్లిలో దుబ్బాసి కిష్టయ్య, కురిక్యాలలో గుండారపు శ్రీకాంత్, గంగాధరలో షేముల మహేష్, కట్ల శ్రీనివాస్, వాసాల హేవంత్, గంట రమేష్, కొండన్నపల్లిలో అంతగిరి రవిని బూత్ కమిటీల ఇన్‌చార్జిలుగా నియమిస్తూ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేండ్ల శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న గామ ఫౌండేషన్ నిర్వాహకులు

చొప్పదండి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట, చొప్పదండిలో గామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గామ ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు ఆహార భద్రతలో భాగంగా ఆదివారం సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గామ ఫౌండేషన్ సీఈవో దుర్గాప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ జోగు పౌలు, ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేష్, ఉపాధ్యక్షులు గజ్జెల సతీష్, గసికంటి సమత, మామిడి లత, కల్లెపల్లి శైలజ, కుక్కల శిరీష పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణతోనే మాదిగలు అభివృద్ధి చెందుతారని మాదిగల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. పట్టణంలో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లో అణిచివేతకు గురై దుర్భరజీవితాలు గడుపుతున్నారన్నారు. రిజర్వేషన్ విషయంలో అత్యధిక శాతంలో ఉన్న మాదిగలు నష్టపోతున్నారన్నారు. వర్గీకరణను వ్యతిరేకించే మాలలను బహిష్కరించాలని తీర్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలు నిలబడే స్థానాల్లో మాదిగలు నిలుచుని ఓడించాలన్నారు. సమావేశంలో బి శ్రీనివాస్, ఆర్ రామచంద్రం, టి సంపత్, ఎం పూర్ణచందర్, ప్రభాకర్, రత్నం, శిరీష, ఎం శ్రీనివాస్, రమేష్, రవీందర్, సతీష్, రాజయ్య, శ్రావణ్, సూర్యకిరణ్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న మాదిగ ఐక్య వేదిక నాయకులు

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమావేశం

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు హైయ్యర్ పింఛన్ ఇంకా అమలుకాక ఆందోళన చెందుతున్నారన్నారు. రిటైర్డ్ కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, కనకయ్య, రవీందర్, ప్రభాకర్, నర్సయ్య, మొగులయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముస్లింలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డివిజన్ మస్జిద్, ఈద్గా, ఖబ్రిస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ చొరవ తీసుకొని హుజూరాబాద్ ముస్లిం షాదీ ఖానాకు 50 లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రామడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిట్టకుమార్ కుటుంబసభ్యులను ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ ఉన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస వ్రత అధ్యయన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితుడు నందకిశోరాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుడు గణపతిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైష్ణవులు అత్యంత పవిత్రంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే ధనుర్మాసోత్సవాలు జనవరి 14వరకు జరుగుతాయ న్నారు. ప్రతిరోజు నిత్య పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

● జమ్మికుంట: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీభగవత్‌గీత జ్ఞాన మందిర్‌లో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 14న ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం, కుడారై పాయస నివేదన, గోధారంగనాయకుల కల్యాణం, ప్రతిరోజు ఉదయం పాశురాలు, కృష్ణోష్టోత్తరం, గోదాదేవి అష్టోత్తరం నిర్వహిస్తామని తెలిపారు.

'లెదర్‌పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి'

చొప్పదండి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ మెగా లెదర్ పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని లెదర్‌పార్కు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొత్తూరి రమేశ్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. లెదర్‌పార్కు ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, అసెంబ్లీలో లెదర్ పార్కు నిర్మాణ విషయాన్ని ప్రస్తావించాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు ఇంగ్లీష్ నోట్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్స్ పంపిణీ చేస్తున్న సాగర్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇంగ్లీష్ నోట్స్‌ను హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రతి కళాశాలలో ఉచితంగా నోట్స్ అందిస్తానన్నారు. దూర ప్రాంత విద్యార్థులు ఇంగ్లీష్ నోట్స్ కోసం 8885549467 నంబర్‌కు వాట్సప్ చేస్తే పీడీఎఫ్ రూపంలో పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాస్థాయిలో తెలంగాణ గణిత ఫోరం ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిచారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో ముగ్గురు చొప్పున విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి స్వదేశ్‌కుమార్, టిఎంఎఫ్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు జంగ మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చక్రధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్షపతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత పరీక్షకు ఎంపిక

మానకొండూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గణిత ప్రతిభ పరీక్షకు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. మానకొండూర్ బాలికల పాఠశాలకు చెందిన మనీషా, ఆదిలక్ష్మి, ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషిత ఎంపికయ్యారు. 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

ఉచిత వైద్య శిబిరం

వీణవంక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డి గ్రామంలో ఆదిత్య సేవా అభ్యుదయ ఆర్ఎంపీ, పీఎంపీ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్ఐ తిరు పతి ప్రారంభించారు. 250 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, ఆర్ఎంపీ, పీఎంపీ యూనియన్ అధ్యక్షుడు కంకణాల శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజి బాబుగౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

బాల్య మిత్రుల సమ్మేళనం

ఇల్లందకుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జమ్మికుంట జడ్పీ హెచ్ఎస్ 1983-84 పదో తరగతి బ్యాచ్ బాల్య కార్యక్రమంలో ముకిరాల సంపత్‌రావు, మంద వెంకటరెడ్డి, గుండా సురేందర్, బత్తిని సాంబ య్య, వట్టపల్లి ప్రకాష్, వాసుదేవరెడ్డి, బలరాం, అశోక్ పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీ నియామకం

గంగాధర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ సంఘం మండల అడ్‌హక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శ్రీనివాస్, కో కన్వీనర్లుగా తాళ్ల నరేష్, లింగాల దుర్గయ్య, రోమాల రమేష్, అజయ్, రాజయ్య సంజీవ్, స్వామిని ఎన్నుకున్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

చొప్పదండి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి వేంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్టుకు పట్టణానికి చెందిన దూస లావణ్య-రాము దంపతులు 18,117 రూపాయలను విరాళంగా ఆదివారం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్, ప్రధాన కార్య దర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె సత్యానందం, ఉపాధ్యక్షుడు ఎన్నం మునీందర్, గుర్రం హన్మంత రెడ్డి, దండె లింగన్న, కటుకం మహేష్ తదితరులు పాల్గొన్నారు.